వేధిస్తున్న పశుగ్రాసం కొరత

- సాగులో యాంత్రీకరణకే రైతుల మొగ్గు
- మూగజీవాలకు అందని పశుగ్రాసం
- పశుపోషణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు


పొలంలో వరి గడ్డిని కోస్తున్న యంత్రం

భీమడోలు: వరి సాగులో యాంత్రీకరణ వల్ల పాడి రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. యంత్రాలతో మాసూళ్ల వల్ల నాణ్యమైన ఎండు గడ్డి దొరక్క రైతులు నానా ఇక్కట్లు పడుతున్నారు. సార్వా సీజన్‌లో గడ్డి తడిసిపోవడంతో పశువుల గ్రాసానికి పెద్దగా వినియోగించడం లేదు. పాడి పశువులకు గ్రాసం కోసం రైతులు ఎక్కువగా దాళ్వా గడ్డినే వినియోగిస్తుంటారు. ఎండా కాలం వచ్చిందంటే పచ్చి గడ్డి మచ్చుకైనా కనిపించదు. వేసవిలో పశుపోషణ అంతా ఎండుగడ్డిపైనే ఆధారపడుతుంది. గతంలో ఎండు వరి గడ్డికి లోటు ఉండేది కాదు. కొన్నేళ్లుగా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో ఎండు గడ్డి కొరత తీవ్రంగా ఏర్పడింది. దీనితో మూగజీవాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిని అధిగమించే దిశగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. ఫలితంగా పాడి పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూలీల ఖర్చులు తట్టుకోలేక..

కొన్నేళ్లుగా కూలీల ఖర్చులు విపరీతంగా పెరగడంతో తట్టుకోలేక రైతులు యంత్రాలతో వరి కోతలకు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు వాతావరణంలో తరచూగా వచ్చే పెనుమార్పులతో పంటను హడాహుడిగా ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు యంత్రాలతోనే వరిచేనును కోయిస్తున్నారు. కూలీలతో పోల్చితే యంత్రాలతో కోతల వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుంది. కూలీలతో కోతలు కోయిస్తే పశువులకు అవసరమైన గడ్డి ఎక్కువ మొత్తంలో దొరుకుతుంది. అదే యంత్రాలతో కోతలు కోస్తున్న పొలాల్లో ఎండు గడ్డి అంతగా రావడం లేదు. యంత్రాలతో కోతల వల్ల వరి దుబ్బులో సగానికి పైగా నేలపైనే ఉండిపోతుంది. మిగిలిన సగం యంత్రంలో నలిగిపోయి పశువులకు ఉపయోగం లేకుండా పోతుంది. అక్కడక్కడే యంత్రాలతో కోసిన గడ్డిని సేకరిస్తున్నా డీజిల్ వాసన రావడంతో ఆ గడ్డిని పశువులు తినడం లేదని రైతులు చెబుతున్నారు. మరో వైపు రైతులు పంట పొలాలను రొయ్యలు, చేపల చెర్వులు మార్చేస్తున్నారు. పలు చోట్ల వరి క్షేత్రాలు రియల్ ఎస్టేట్ భూములుగా మారిపోతున్నాయి. ఈ కారణాలతో పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతుంది.

ఎండుగడ్డికి డిమాండ్

కేవలం కూలీలతో కోసిన గడ్డికి మాత్రమే పశువుల పని చేయడంతో అది అతి తక్కువగా అందుబాటులో ఉండడంతో గడ్డి ధరలు భారీగా పెరిగాయి. ట్రాక్టర్ ఎండు గడ్డి ధర రూ.12 నుంచి 14వేల పలుకుతుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు నేరుగా పంట పొలాల్లోనే గడ్డిని కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీనితో స్థానికంగా గడ్డికి మంచి డిమాండ్ ఏర్పడింది. రైతుల పంట గట్టుకు రావడానికి కోత యంత్రానికి, ట్రాక్టర్‌తో కలిపి దాదాపు రూ.4500 ఖర్చు అవుతుంది. ఈ పరిస్థితుల్లో పశువులకు గడ్డి కొరత ఏర్పడిందని పాడి రైతులు గగ్గోలు పెడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పశుగ్రాస పథకాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కనిష్ఠంగా 25 సెంట్లు, గరిష్ఠంగా 2.5 ఎకరాల సొంత భూమి కలిగిన రైతులకు పశుగ్రాసం పెంపకానికి చేయూతనిచ్చింది. సైలేజ్ గడ్డి, పీఎంఆర్ దాణా, పశుగ్రాసం పెంచడానికి పచ్చి రొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై అందించేవారు. దీనితో వేసవిలో పశుగ్రాసానికి కొరత లేకుండా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పశుగ్రాస పథకాలను పక్కన పెట్టేసింది. దీనితో ఈ ఏడాది రబీ కోతలు మొదలైన వెంటనే పశుగ్రాసం కొరత వేధిస్తోంది.

క్లుప్తంగా

త్వరలో వైఎస్సార్‌సీపీ నూతన కమిటీలు


కొఠారు అబ్బయ్య చౌదరి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గ, మండల, గ్రామ, అనుబంధ విభాగాల నూతన కమిటీల నియామకం వచ్చే నెలలోపు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా నియోజకవర్గానికి సంబంధించి పార్టీ నూతన కమిటీల నియామకం కోసం ఇప్పటికే రాష్ట్ర కమిటీకి పేర్లు సిఫార్సు చేయడం జరిగిందన్నారు. పార్టీ అభివృద్ధికి సేవలు అందించిన కార్యకర్తలు, నాయకులకు పార్టీ అధిష్టానం సముచిత గుర్తింపు ఇస్తుందని అబ్బయ్య చౌదరి తెలిపారు.

ఆలయ పరిసరాలు శుభ్రం


ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఆలయ ప్రాంగణాన్ని యంత్రం సాయంతో పరిశుభ్రం చేయిస్తున్నారు. ఆలయ ఈవో వంశీ, నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దెందులూరు ఏవోకు ఎంపీడీఓగా పదోన్నతి


ఏఓ సుజాత

దెందులూరు: దెందులూరు ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వై. సుజాతకు ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఉన్నత అధికారులు లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతి బదిలీలో భాగంగా సుజాతను కామవరపుకోట ఎంపీడీఓగా నియమించారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్ల అందజేత


ఎన్‌సీసీ కేడెట్లతో హెచ్‌ఎం పి.భువనేశ్వరరావు, అసోసియేషన్ ఎన్‌సీసీ అధికారి కె.వెంకటేష్

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు పెదవేగి మండలం పినకడిమిలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో తమ సత్తా చాటారు. 19వ ఆంధ్ర బెటాలియన్ ఏలూరు ఆధ్వర్యంలో గత నెల 24వ తేదీ నుంచి 3వ తేదీ వరకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో పూళ్ల ఎన్‌సీసీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఫైరింగ్, డ్రిల్, గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ పొందినట్లు పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి కె.వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా పూళ్లలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం పెనుగొండ భువనేశ్వరరావు కేడెట్లను అభినందించి వారికి సర్టిఫికెట్లు, మొమెంటోలు అందించారు.

చెట్టున్నపాడులో చోరీపై కేసు నమోదు

భీమడోలు: చెట్టున్నపాడులో ఓ పాస్టర్ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొల్లేరు గ్రామం చెట్టున్నపాడులోని కొండపల్లి మధుబాబు అదే గ్రామంలోని సీబీసీఎన్‌సీ చర్చిలో పాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని మూడో రోజుల పాటు సువార్త కూడికలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తన ఇంటికి తాళాలు వేసి శుక్రవారం రాత్రి సువార్త ప్రార్థనలకు కుటుంబమంతా వెళ్లారు. సువార్త కూటమిని ముగించుకుని అదే రోజు రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలతో పాటు బీరువా తాళాలు పగుల కొట్టి రూ.1.70 లక్షల విలువ గల బంగారు అభరణాలు, నగదును అపహరించి పరారయ్యారు. బాధితుడు మధుబాబు ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

కొయ్యలగూడెం: సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ కె.వీరబ్రహ్మం శనివారం పేర్కొన్నారు. మంగపతిదేవిపేట సమీపంలోని ఓ రైతుకు చెందిన పొలంలో 200 లీటర్లు కలిగిన డ్రమ్ములను గుర్తించి మొత్తం 400 లీటర్ల బెల్లపు ఊట రెవెన్యూ అధికారుల సమక్షంలో ధ్వంసం చేసినట్లు తెలిపారు. వ్యవసాయ పొలానికి సంబంధించిన రైతును విచారించగా భూమిని కౌలుకు ఇచ్చినట్లు తెలిపారన్నారు. మంగపతిదేవిపేట పరిసర ప్రాంతంలో నాటు సారా తయారీ ఎక్కువగా ఉందని ప్రజలు ఆరోపణలు చేశారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన పీడీ శారద

దెందులూరు: నిబంధనలకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ జరగాలని స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి సాధన ప్రధాన లక్ష్మణ్, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద అన్నారు. శనివారం దెందులూరులో 110, 111 కోడ్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. కేంద్రాల్లో సౌకర్యాలు, రికార్డులు పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలను సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, పర్యవేక్షకులు సమన్వయంతో కేంద్రాల అభివృద్ధి, బలోపేతం లక్ష్యంగా సేవలు అందించాలన్నారు. ఆమె వెంట దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, హైమావతి ఉన్నారు.

ఎద్దుల తరలింపు అడ్డగింత

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు వద్ద శనివారం రాత్రి 18 ఎద్దులను తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. విజయనగరం సంతలో కొనుగోలు చేసి ఏలూరుకు తీసుకువస్తున్నారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మోదీ మాటలు బాబుకు వర్తించవు


నౌడు వెంకట రమణ

నిడమర్రు: ఏపీ రాష్ట్ర రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ వికసిత్ భారత్‌కు ఆ నాలుగు వర్గాలే మూల స్తంభాలు లాంటి వారని అన్న మాటలు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌ను పరోక్షంగా మెచ్చుకున్నట్లే అని ఆ పార్టీ స్టేట్ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకట రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజన్‌గా ఎదగాలంటే పేదలు, యువత, మహిళలు, కార్మికులు అభివృద్ధి చెందాలని, ఆనాలుగ వర్గాలకు పెద్దపీట వేయాలని మోదీ పేర్కొన్నారన్నారు. మోదీ మాటలు చంద్రబాబుకు వర్తించవన్నారు. ఎందుకంటే మోదీ సూచించిన ఈ నాలుగు వర్గాలకు సీఎంగా జగన్ పెద్దపీట వేశారన్నారు. చంద్రబాబుకు ఇలాంటి పనులు చేయడం కష్టమని అందరికీ తెలిసిందే అని అన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన భరోసాపై ప్రజలు కొంత వరకు నమ్మచ్చేమో కానీ, బాబు మాటలు ఎవ్వరూ నమ్మరని నౌడు విమర్శించారు. మోదీ ప్రకటించిన పనుల్లో జాతీయ రహదారుల నెట్‌వర్క్ సిస్టం, రైల్వే పనులు వంటి వాటిల్లో ఎక్కువ పనులు గతంలో వైఎస్ జగన్ పాలనలో కేంద్రం నిర్ణయించినవే అని, అయితే అవి ఇప్పటి ప్రభుత్వంలో కేంద్రం అమలు చేస్తుందని అన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిదీ



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్, పాల్గొన్న గ్రామస్తులు

పెదవేగి : నేటి సమాజంలో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శనివారం పెదవేగి మండలం వంగూరు గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలపైన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. పిల్లలను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలని, అప్పుడే వారు అభివృద్ధిలో పయనిస్తారని అన్నారు. కార్మికులకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబరు 15100 కు ఫోను చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. న్యాయవాది పి.రత్నరాజు, ప్యానల్ న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, జీవీ భాస్కర్, గ్రామ సర్పంచి రూత్ మేరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా పద్దాల వెంకమ్మ సంబరాలు


వడ్లపట్లలో మేళ తాళాల నడుమ ఊరేగుతున్న గణాచారులు

భీమడోలు: అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్ల గ్రామ శ్రీ పద్దాల వెంకమ్మ సంబరాలు వైభవంగా సాగుతున్నాయి. మూడు రోజులు పాటు జరిగే ఈ సంబరాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం మహిళలు, ఆడపడుచులు అమ్మవార్లకు జలాభిషేక పూజలు చేశారు. సాయంత్రం గరగ నృత్యాలు, మేళ తాళాలతో గణాచారులు గ్రామ సంచారం నిర్వహించారు. ఇంటికి వచ్చిన గణాచారులకు గ్రామస్తులు పసుపు నీళ్ల వారబోసి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆలయాల్లోని అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించారు. నిర్వాహకులు రామిశెట్టి బుజ్జి గోపాల్, రామిశెట్టి రమణయ్య, రత్నాలరావు మాట్లాడుతూ రామిశెట్టి వారి ఆడపడుచు పద్దాల వెంకమ్మ అమ్మవార్లకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి జాతర సంబరం చేస్తామన్నారు. ఆదివారం అమ్మవార్లకు నైవైద్యాలు సమర్పించడం జరుగుతుందన్నారు.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవ, తోమాలసేవ, ఆరాధన, తీర్థప్రసాద గోష్ఠి తదితర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులకు బుట్టాయగూడెంకు చెందిన గద్దె సీతారామచంద్రరావు, గద్దె నాగ భూషణం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలు రెడ్డి రంగప్రసాద్, వారి కుటుంబ సభ్యుల సహకారంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామివారి ఆశీస్సులు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించి, సత్కరించారు.

● తాజా మామిడి.. రైతు బజార్లో సందడి


పెదవేగి: మార్కెట్ యార్డులోని రైతు బజార్‌లో మామిడి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. బంగిన పల్లి, సువర్ణలేఖ, చెరుకు రసాలు, కొత్తపల్లి కొబ్బరి, పంచదార కంచి, పండూరువారి మామిడి, కోలంగోవ, తోతాపురి తదితర రకాలకు డిమాండ్ ఉంది. గతేడాది రిటైల్ మార్కెట్‌లో డజను పండ్ల ధర రూ 100 ఉంటే, ప్రస్తుతం రూ 180 పలుకుతోంది. నేరుగా అమ్మకాలు చేయడం వల్ల ఆదాయం బాగుందని రైతులు అంటున్నారు. తాజా పండ్లు అందుబాటులో దొరకడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తక పఠనంతోనే సమగ్రాభివృద్ధి


భీమడోలు: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు, చిత్రంలో టీవీ ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్

భీమడోలు: పుస్తక పఠనంతో విద్యార్థులు సమగ్రాభివృద్ధి సాధిస్తారని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఐదో రోజు శనివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో చిన్నారులు నీతి కథలు, పుస్తక సమీక్షలు, సామూహిక పుస్తక పఠనం కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మానవత కెరీర్, గైడెన్స్ డైరెక్టర్ టీవీ ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కెరీర్ అభివృద్ధికి విద్యార్థులు చేపట్టాల్సిన సూచనలను టీవీ ఉమామహేశ్వరరావు వివరించారు. సుధాకర్ నీతి కథలు చెప్పారు. విద్యార్థులకు గణితంలో మెలవకులు, జీకే పాయింట్లను గ్రంథపాలకుడు వివరించారు. అనంతరం ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంపై అవగాహన కల్పించారు. చిన్నారులు నృత్యాలు చేసి సందడి చేశారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎన్‌బీ అమర్‌నాథ్, గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణిల ఆధ్వర్యంలో పుస్తక పఠనం, పలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాధనతో లక్ష్యం అధిగమించాలి

దెందులూరు: ప్రణాళిక, నిరంతర సాధనతోనే లక్ష్యాన్ని సాధించవచ్చునని రిసోర్స్ పర్సన్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం పోతునూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. సంజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు.


పెదపాడు: గ్రంథాలయంలో ప్రముఖుల జీవిత చరిత్రను వివరిస్తున్న ఉపాధ్యాయులు


దెందులలూరు: శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ సంజయ్‌కుమార్

ప్రముఖుల జీవిత చరిత్ర తెలుసుకోవాలి

పెదపాడు: ప్రముఖుల జీవిత చరిత్రలు భావితరాలకు ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన వేసవి శిక్షణా తరగతుల్లో స్థానిక గ్రంథపాలకుడు డీ జాన్‌బాబు మాట్లాడారు. ప్రముఖుల జీవిత చరిత్రలు చదవడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. కార్యక్రమంలో కృష్ణా గురుకుల పాఠశాల ఉపాధ్యయురాలు సుజనా తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటలపై క్రీడా శిక్షణ అందించారు.

స్వర్ణాంధ్ర 2047పై అవగాహన సదస్సు

ఉంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర 2047పై అవగాహన సదస్సు నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీలో ప్రభుత్వ నిబంధనలపై ఎంపీడీవో మనోజ్ అధికారులకు తెలియజేశారు. ఆయా శాఖలకు సంబంధించి అభివృద్ధి, ఉపాధి అవకాశాలను ఏ విధంగా చేయొచ్చు అనే అంశాన్ని తెలియజేశారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పోలవరం రూరల్: ప్రగఢపల్లి గ్రామానికి చెందిన రైతు చాపర్ల వెంకటాచలానికి చెందిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గత రెండు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులు, భారీ వర్షాలకు పొలాల్లో ఉన్న తాటి చెట్టు విరిగి పడింది. విద్యుత్ వైర్లు కూడా తెగిపడిపోయాయి. మేత కోసం వెళ్లిన గేదె ప్రమాదవశాత్తు తీగలకు తగిలి మృతిచెందింది. పొలానికి వెళ్లిన రైతుకు విద్యుత్ వైర్లు తెగిపడి ఉండటంతో విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించి, పశుసంవర్ధక శాఖ, విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు.

నేటినుంచి నారాయణపురంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


నారాయణపురంలో నూతనంగా నిర్మించిన భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం

ఉంగుటూరు: నారాయణపురంలో నూతనంగా నిర్మించిన భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీనారాయణ, దత్తాత్రేయ, రాజశ్యామల, గణపతి, ఆంజనేయ, గరుడ, వేంకటేశ్వర స్వామి విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, వసంతకుమారి, పత్సమట్ల ధర్మరాజు, స్వాతిలక్ష్మి పీటలు మీద కూర్చుని పూజలు చేయనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8 వతేదీన మహా అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకలు వెల్లడించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చింతలపూడి: కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక కోర్టు హాల్‌లో ఆటో యూనియన్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో జడ్జి మధుబాబు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు ఇ- శ్రమ్ పోర్టల్‌లో తప్పనిసరిగా పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఆర్థిక స్తోమత లేని వారు మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునన్నారు. డ్రైవర్లు తప్పకుండా లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. సంతానం నుంచి నిరాదరణకు గురైన వృద్ధులు ఆర్డీవో వద్ద అర్జీ చేసుకుంటే పిల్లల నుంచి భరణం పొందవచ్చునన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణం చేస్తే జరిమానా విధించి కేసులు పెట్టడం జరుగుతుందని చెప్పారు. యూనియన్ అధ్యక్షుడు చేకూరి వెంకట రమణారావు, కోర్టు సూపరింటెండెంట్ పీజీ నాయుడు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సంగీతం, నృత్యం తెలుగు వారి ఆస్తులు


కూచిపూడి నాట్యరత్న పసుమర్తి శ్రీనివాస శర్మను సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంగీతం, నృత్యం తెలుగు ప్రజల ఆస్తులని అవనిగడ్డ ఎమ్మెల్యే మండల బుద్ధ ప్రసాద్ అన్నారు. నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో సంగీత నృత్యోత్సవాలు స్థానిక వైఎంహెచ్ఏ హాలులో శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ కళా దీపిక నృత్య అకాడమీ నిర్వాహకురాలు నాట్యాచారిణి ఎ.పార్వతీ రామచంద్రన్, కళారత్న కేవీ సత్యనారాయణ ఏలూరు నగరానికి కూచిపూడి నృత్యంతో ప్రపంచ ఖ్యాతిని తీసుకొచ్చారన్నారు. వారు నృత్య సంగీత రంగాల్లో చేసిన విశేష కృషిని అభినందించారు. తొలుత త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా కళావేదికపై స్థానిక సంగీత కళాకారులు ఆలపించిన త్యాగరాజ పంచరత్న సేవ సంగీత మహోత్సవంలో ఆలపించిన గీతాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం అకాడమీ విద్యార్థులు త్యాగరాజ స్వామి కీర్తనలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కూచిపూడి నాట్యరత్న పసుమర్తి శ్రీనివాస శర్మను సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. కళారత్న కేవీ సత్యనారాయణ, వేణుగోపాల్ లునాని, దువ్వి హేమసుందర్ పాల్గొన్నారు.